క్లుప్తంగా

12న అప్రెంటిస్‌షిప్ మేళా

నర్సీపట్నం: ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ మేళాకు సుమారు 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్స్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వెంకట రమణ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



వెంకట రమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నాతవరం: ఇటీవల మృతి చెందిన చెర్లోపాలెం మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పెద్దకర్మ సందర్భంగా వెంకట రమణకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు కరక అప్పలరాజు పాల్గొన్నారు.

ఈ చలానా బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



వాహనాలను తనిఖీ చేస్తున్న కొత్తకోట పోలీసులు

రావికమతం: మోటారు వాహనాల ఈ చలానా బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.కొత్తకోట పోలీసు స్టేషన్ సమీపంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. కొన్ని వాహనాలకు ఈ చలానా బకాయిలున్నట్టు గుర్తించి, మీ సేవ కేంద్రాల ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అప్పారావు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



కృష్ణారాయుడిపేట జంక్షన్ సమీపంలో మట్టిరోడ్డు దుస్థితి

కె.కోటపాడు : ఉగ్గినవలస–కృష్ణారాయుడిపేట గ్రామాల మధ్య జీవీఎంసీ కెనాల్‌ను ఆనుకుని ఉన్న మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. రెండు గ్రామాల ప్రజలతో పాటు ఆర్.వై.అగ్రహారం, కొత్త అగ్రహారం గ్రామస్తులు ఈ మట్టి రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై పడిన గోతుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తారురోడ్డు నిర్మించి, తమ కష్టాలను తీర్చాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి తీర్థం



కోలాటం ఆడుతున్న మహిళలు

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో తాపీమేస్త్రీల సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కె.కోటపాడు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా హాజరయ్యారు. తీర్థాన్ని పురస్కరించుకుని కోలాటం నిర్వహించారు.

రోడ్డు పరిశీలన

దేవరాపల్లి: ప్రజలందరూ సహకరిస్తే ఎం.అలమండ రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఎం.అలమండ గ్రామంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి బుధవారం ఆయన పర్యటించి, రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. వేచలం నుంచి వారాడ కూడలి వరకు 13 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.3 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ప్రజలు సహకరిస్తేనే రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయని ఆయన ఎమ్మెల్యే తెలిపారు.

అమ్మో.. వానరాలు



తరచూ దాడులతో ప్రజల్లో భయాందోళనలు

కోతుల బెడదతో పంటలు వేయడం మానుకున్న రైతులు

అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన



రోడ్డుపై వానరాలు

నాతవరం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను వానర సైన్యం భయభ్రాంతులకు గురిచేస్తోంది. గుంపులు గుంపులుగా కోతులు సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల తలుపులు తెరిచి ఉంచినా, ఆదమరిచి ఉన్నా అందినకాడికి ఎత్తుకెళుతున్నాయి. పెద్దాచిన్నా అన్న తేడాలేకుండా అందరినీ కోతులు రక్కడం, గాయపరచడం సాధారణంగా మారిపోయింది. ఇటీవల మండల వ్యాప్తంగా 40 మందిపై కోతులు దాడి చేసి, గాయపరిచాయి. మండలంలో మర్రిపాలెం, వెన్నలపాలెం, శృంగవరం, డి.యర్రవరం, నాతవరం, గాంధీనగరం, రాజుపేట, అగ్రహారం, పెదగొలుగొండపేట, ఎ.పి.పురం, యం.బి.పట్నం, గన్నవరం, గునుపూడి, వల్సంపేట తదితర గ్రామాల్లో కోతులు అధికంగా సంచరిస్తూ దాడి చేస్తున్నాయి.



ఎ.పి.పురం సమీపంలో కోతుల గుంపు

వీటి దాడిలో గాయపడినవారిలో అధికంగా వృద్ధులు, చిన్నారులు ఉన్నారు. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లేందుకు ఆయా గ్రామస్తులు భయపడుతున్నారు. మొదట్లో కోతులు పొలాల్లో మాత్రమే సంచరించి, పంటలను నాశనం చేసేవి. ఆ సమయంలో బెదిరిస్తే పారిపోయేవని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం పొలాల్లో పనులు చేస్తుండడంతో అవి గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయని వారు చెప్పారు. ఇటీవల వెన్నెలపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో రైతులు చందాలు వేసుకుని బోన్లు ఏర్పాటు చేసి, కోతులను బంధించి, ఏజెన్సీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఆ తరువాత కోతుల బెడద కొంత తగ్గింది. ఇప్పుడు మళ్లీ కోతులు ఊళ్లలోకి వస్తున్నాయని ఆయా గ్రామస్తులు తెలిపారు. కోతుల బెడద కారణంగా ఇప్పటికే చాలా మంది రైతులు కూరగాయలు సాగు చేయడం, పండ్ల తోటలు వేయడం మానుకున్నారు.

స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినా...

గత ఏడాది డిసెంబరు 19న మర్రిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడి దృష్టికి మాజీ వార్డు మెంబరు అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో రైతులంతా కోతుల సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. తమ సమస్య గురించి స్పీకర్ పట్టించుకోలేదని పలువురు వాపోయారు.

ఒంటరిగా వెళ్లడానికి భయమేస్తోంది



కోతుల సంఖ్య బాగా పెరిగిపోయింది. గుంపుగుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్లడానికి భయమేస్తోంది. మా గ్రామంలో కోతుల దాడిలో చాలా మంది గాయపడ్డారు. ఈ సమస్యను పలుమార్లు గ్రామసభల్లో అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

– వేమల సూర్యనారాయణ, సర్పంచ్, గునుపూడి

మున్సిపల్ సిబ్బంది సమ్మె నోటీసు



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

నర్సీపట్నం: మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ ఈ నెల 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ రద్దు, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సమ్మెలో పాల్గొనున్నట్టు చెప్పారు. జనాభాకు తగిన పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. కోవిడ్ సమయంలో పని చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు ఇతర కార్మికులవలే వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, యూనియన్ నాయకులు బొర్రా శ్రీను, వాసుపల్లి రమణ, కుపరాల హేమంత్ పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి



మాడుగులలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



జంపెనలో వాసవీ మాతను దర్శించుకుంటున్న క్లబ్ సభ్యులు



రావికమతంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతిని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. స్థానిక భక్తుడు పుట్టా నారాయణమూర్తి కుటుంబ సభ్యులు వాసవీమాత పంచలోహ విగ్రహాన్ని ఆలయానికి అందజేశారు. పంచామృత అభిషేకం అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, వాసవీక్లబ్ అధ్యక్షుడు కొట్యాడ రమేష్, వనిత క్లబ్ అధ్యక్షురాలు పుట్టా రాధిక, ఇతర సభ్యులు పుట్టాబలరామ్, మామిడిశ్రీను, శ్రీనాదు రమేష్, జాగాని పద్మ, పుట్టామాధవి తదితరులు పాల్గొన్నారు. జంపెన గ్రామంలో వాసవీమాత జయంతి వేడుకలను ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శి పుట్టా మురళీ కృష్ణ, పీఆర్వో పుట్టా మోహనరావుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య మహాసభ ట్రెజరర్ పాలకుర్తి శ్రీనివాసరావు, కారదర్శి శ్రీనాదు బాబు, డైరెక్టరులు మేడిశెట్టి అర్జునరావు, పుట్టా ప్రసాద్‌రావు, అనపగడ్డి అప్పారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మాడుగులరూరల్ : కేజే పురం జంక్షన్‌లో గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాలకుర్తి శ్రీనివాసరావు, పద్మ దంపతులతో పాటు వాసవీ క్లబ్ సభ్యుల ఆర్థికసాయంతో భారీగా అన్న సమారాధన నిర్వహించారు. 20 కిలోల ఇత్తడి కిరీటాన్ని ఆలయానికి అందజేశారు.

రావికమతం: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం



ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న మనోహర్ సత్యనారాయణ



చీడికాడలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కె.కోటపాడు : ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చని, ధ్యానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చౌడువాడ గ్రామానికి చెందిన భీశెట్టి మనోహర్ సత్యనారాయణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కె.కోటపాడులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పిరమిడ్ విధానం ద్వారా విద్యార్థులతో ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారిణి ఎం.పద్మావతి పాల్గొన్నారు.

చీడికాడ: వార్తా పత్రికల పఠనంతో సమకాలిన అంశాలపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి ఎం.జోగేశ్వరి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వార్తా పత్రికల పఠనంపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు.

మాడుగుల రూరల్ : మండలంలోని కేజే పురం గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వి.శ్రుతి మాట్లాడుతూ ఈ తరగతులు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనాన్ని చిన్ననాటి నుంచి అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సత్యం, సర్పంచ్ జగన్

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ దాడి జగన్ బుధవారం భూమి పూజచేశారు. రూ.7లక్షల వ్యయంతో ఎం.అలమండ–వారాడ తారురోడ్డు నుంచి సుమారు 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించనున్నారు. జిల్లా పరిషత్ నిధులు రూ. ఐదు లక్షలు, పంచాయతీ నిధులు రూ. రెండు లక్షలు మంజూరు చేశారు.రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జెడ్పీటీసీ సత్యం, సర్పంచ్ జగన్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కృష్ణదేవిపేటలోని సమాధి వద్ద స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళాఅధ్యక్షురాలు లోచల సుజాతతో పాటు స్థానికులు నివాళులర్పించారు. కొంకసింగిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు సత్యనారాయణ, బాబూరావు ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కృష్ణదేవిపేటలో అల్లూరి విగ్రహానికి స్థానిక సీపీఐ నేతల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అల్లూరి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద గల అల్లూరి విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తమరాన శ్రీను, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, కణితి వాసు, బేతిరెడ్డి విజయ్, దేవత అరుణ, దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహం వద్ద బీజేపీ నాయకులు కాళ్ల సుబ్బారావు, చిందాడ నూకేశ్వరరావు, అడిగర్ల సతీష్, వెలగా జగన్నాథరరావు, పాకలపాటి అరవిందురాజు, బోళెం శివ తదితరులు నివాళులర్పించారు. మున్సిపల్ స్టేడియంలోని గల అల్లూరి విగ్రహం వద్ద సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ పూలమాల వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, డి.సీహెచ్. క్రాంతి, సమితి సభ్యులు జి.రాధాకృష్ణ, చోడే శ్రీనివాసరావు, చిన్నమ్మనాయుడు, సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో గల అల్లూరి విగ్రహానికి ఆర్డీవో వి.వి.రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి నడయాడిన ఈప్రాంతంలో పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ అశోక్, జిల్లా సర్వేయర్ కుమార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి పి.దమయంతి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు అల్లూరి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు. రాజాం, మండల కేంద్రం బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయతీ వడ్డాదిలలో అల్లూరి విగ్రహం, చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు.

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేటలో నవతరం యువత ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయుడు చిట్టిమోజు బాబూరావు, బీజేపీ మండలశాఖ మాజీ అధ్యక్షుడు తమ్మునాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెం, తామరం గ్రామాల్లో పలువురు నాయకులు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, మండల బీజేపీ నేతలు, తామరంలో తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు నివాళులర్పించారు.



నర్సీపట్నం మున్సిపల్ స్టేడియంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామునాయుడు



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకుడు కాళ్ళ సుబ్బారావు



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్డీవో వి.వి.రమణ



కొంకసింగిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాత కృష్ణదేవిపేటలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



రాజాంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



బుచ్చింపేటలో నివాళులర్పిస్తున్న నవతరం యువత సంఘ సభ్యులు



తామరంలో నివాళులర్పిస్తున్న హరిబాబు తదితరులు

వర్షాతిరేకం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం

గొలుగొండ/రోలుగుంట: గొలుగొండ, రోలుగుంట మండలాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గొలుగొండ మండలంలోని కొత్త జోగుంపేట, అమ్మపేట, గొలుగొండ, కొత్తపాలెం, సాలిక మల్లవరం గ్రామాల్లో, రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో వర్షం పడింది. ఈ వర్షం కారణంగా మెరక ప్రాంతాల్లో వేసిన కూరగాయలు, సరుగుడు, చెరకు పంటలకు మేలు జరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

ఎస్.రాయవరం: పరిశ్రమల్లో కార్మికులకు భద్రతా చర్యలతో పాటు విధిగా వసతులు కల్పించాలని యలమంచిలి కోర్టు ప్యానల్ అడ్వకేట్ టి.నూకరాజు అన్నారు. గుడివాడ శివారులో ఉన్న సాయి మెరైన్ పరిశ్రమలో కార్మికులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలకు లోబడి కార్మికులతో పనులు చేయించాలని, పనులు చేసేటప్పుడు అవసరమైన భద్రత పరికరాలు విధిగా ఇవ్వాలన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

దేవరాపల్లి: ఉపాధి హామీ చట్టం పరిరక్షణ, పెండింగ్ బకాయిలు, కనీస వేతనం రూ. 600 చెల్లించాలని, 200 రోజుల పాటు పనులు కల్పించాలన్న తదితర డిమాండ్లతో ఈ నెల 20 చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న పిలుపునిచ్చారు. మండలంలోని మారేపల్లి, రైవాడ, పెదనందిపల్లి, చిననందిపల్లి, కాశీపురం గ్రామాల్లో బుధవారం పర్యటించి ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి సమ్మె విజయవంతం చేయాలని కోరారు. కూలీల పోరాటం ద్వారా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూలీలదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 20 కూలీలంతా పనులు మానేసి నిరసన తెలపాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

రావికమతం: కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని స్థానిక హైస్కూల్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆర్యవైశ్యుల సహకారంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 42 మందికి వైద్యులు వివేక్ తదితరులు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు.వారిలో 21మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు.వీరందరికీ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్టు ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్టాఫ్ సంధ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి బండారు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అచ్యుతాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ధర్మిరెడ్డి శ్రీనివాసరావు(46) బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామన్నపాలెంలో గత సోమవారం బైక్‌పై వెళ్తున్న శ్రీనినివాసరావును లారీ వెనక నుంచి ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను కేజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద అర్ధాంతరంగా మరణించడంతో ఆ కుటుంబంలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.